క్లుప్తంగా

అహోబిలేశుడికి ప్రత్యేక పూజలు



ఆలయ సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే గంగుల

ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలం లక్ష్మీ నరసింహస్వామిని మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా మఠం ప్రతినిధులు, ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నంద్యాల(వ్యవసాయం): కళారాధన, లయన్స్ క్లబ్, ఐఎంఏ సంయుక్త నిర్వహణలో మాతృభూమికి కళార్చన పోటీల్లో భాగంగా శుక్రవారం 12వ రోజు స్థానిక వివేకానంద ఆడిటోరియంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. క్విజ్ మాస్టర్‌గా డాక్టర్ రవికృష్ణ, కార్యదర్శులుగా శ్రీకాంత్, రవిప్రకాష్ వ్యవహరించారు. పోటీల్లో ఆరు పాఠశాలల నుంచి 5 మందితో కూడిన జట్లు పోటీ పడ్డాయి. దేశ స్వాతంత్ర్య ఉద్యమ చరిత్ర, గాంధీజీ జీవితం, క్రీడలు, సాంస్కృతిక రంగం, సైన్స్ అండ్ టెక్నాలజీ, చరిత్ర, సాహిత్యం వంటి అంశాలపై పది రౌండ్లలో మూడు గంటల పాటు జరిగాయి. సీనియర్ క్విజ్ విజేతగా ప్రథమ స్థానంలో గుడ్‌షెప్పర్డ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్, ద్వితీయ స్థానంలో గురురాజ , తృతీయ స్థానంలో రోటరీ స్కూల్ నిలిచింది.

కనీస వేతనం ఇవ్వాలి



మాట్లాడుతున్న ఏసురత్నం

నంద్యాల(న్యూటౌన్): ఆశా లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగమణి, రమణకుమారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్స్‌కు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. ఎన్నికల హామీలో భాగంగా వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పిస్తామని కూటమి నాయకులు చెప్పారని గుర్తు చేశారు. యూనియన్ జిల్లా నాయకురాలు చెన్నమ్మ, వరాలమ్మ, కృపావతి, సువర్ణమ్మ, భాగ్యమ్మ, షమీమ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

రుద్రవరం: మండల పరిధిలోని తువ్వపల్లె తిప్ప మీదున్న ఏపీ మోడల్ పాఠశాల విద్యార్థులు ఆర్చరీ జిల్లా స్థాయి పోటీల్లో సత్తా చాటి రాష్ట్ర సాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఈ నెల 10న కర్నూలులో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ ఆర్చరీ పోటీల్లో అండర్–19 విభాగంలో సుప్రజ, ఆచ్చర్య, అండర్–17లో రాఘవేంద్ర, అలేఖ్య, లక్ష్మీకళ్యాణి సత్తా చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. విద్యార్థులతో పాటు పీడీ శ్రీనివాసులను పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు

చాగలమర్రి: రాష్ట్ర, జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు దక్కించుకున్న చాగలమర్రికి చెందిన లక్ష్మయ్య, ఎం.మహబూబ్‌బాషా, హబీబున్నీసాలను శుక్రవారం ఎస్టీయూ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అదనపు కార్యదర్శి శివశంకర్ మాట్లాడుతూ అవార్డు గ్రహీతలను స్ఫూర్తిగా తీసుకుని మరింత మంది ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి బోధన చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్షులు మస్తాన్‌వలి, మండల ప్రధాన కార్యదర్శి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పోటెత్తిన కుందూ!



హరివరం సమీపంలో కుందూనది వంతెనపై ప్రవహిస్తున్న వరద నీరు,



క్రిష్టిపాడు శివారులో ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూనది,



ఇంజేడు వద్ద కుందరవాగు వంతెనకు సమాంతరంగా ప్రవహిస్తున్న వర్షపు నీరు

- నీట మునిగిన పంట పొలాలు



దొర్నిపాడు శివారులో నీట మునిగిన మినుము పైరు

ఉయ్యాలవాడ: కుందూనదికి వరద నీరు వచ్చి చేరుతోంది. నదిలో నీటి ఉధృతి పెరగడంతో తీర ప్రాంతాల్లోని పంట పొలాలు నీట మునగాయి. బుధ, గురువారాల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో విస్తృతంగా భారీ వర్షాలు కురిశాయి. శ్రీశైలం, అవుకు రిజర్వాయర్ వరద నీరు వచ్చి చేరడంతో పాటు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి కుందూనదికి భారీగా నీటిని అధికారులు విడుదల చేశారు. దీంతో మండల పరిధిలోని మాయలూరు, ఆళ్లగడ్డ ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిలో ఇంజేడు గ్రామ సమీపంలో ఉన్న కుందరవాగు వంతెనకు సమాంతరంగా వరద నీరు ప్రవహిస్తోంది. ఉయ్యాలవాడ, రూపనగుడి గ్రామాల మధ్య వంతెనకు సమాంతరంగా, హరివరం, గుళ్లదుర్తి, బోడెమ్మనూరు గ్రామాల వద్ద వంతెనలపై వరద నీరు ప్రమాదస్థాయిలో ప్రవహిస్తోంది. ఆర్.జంబులదిన్నె, కాకరవాడ, ఒంటెద్దుపల్లె, బోడెమ్మనూరు గ్రామాలు చుట్టూ కుందూనది నీరు వచ్చి చేరడంతో ఆయా గ్రామాల ప్రజలకు రాకపోకలు స్తంభించిపోయాయి. నదీ తీరం వెంట సాగు చేసిన వరి, మొక్కజొన్న, పత్తి, మినుము తదితర పంటలు నీట మునిగాయి. వరద ఉధృతి ఇలాగే కొనసాగితే పంటలు పూర్తిగా దెబ్బతినే ప్రమాదం వుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తహసీల్దార్ ప్రసాద్‌బాబు, రెవెన్యూ సిబ్బందితో కలిసి కుందూనదిలో నీటి ఉధృతిని శుక్రవారం పరిశీలించారు. రైతులు, ప్రజలను అప్రమత్తండగా ఉండాలని 14 గ్రామాల్లో రెవెన్యూ అధికారులతో దండోరా వేయించారు.



బోడెమ్మనూరు వద్ద నీటి ఉధృతిని పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రసాద్‌బాబు

దొర్నిపాడు మండలంలో..

దొర్నిపాడు: మండలంలో రెండు రోజుల నుంచి భారీ వర్షం కురుస్తోంది. దీంతో వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. పొలాల్లో ఎక్కడ చూసినా వర్షపు నీరే కనిపిస్తోంది. క్రిష్టిపాడు వద్ద కుందూనది ఉధృతంగా ప్రవహిస్తోంది. వంతెనపై నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు స్తంభించాయి. కుందూ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సుభద్ర హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నంద్యాల(అర్బన్): పట్టణంలోని పద్మావతినగర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు డి–2 ఏఈ రామయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పద్మావతినగర్‌తో పాటు టెక్కె, పాలిటెక్నిక్ కాలేజీ సమీపం, శ్రీనివాసనగర్, సంజీవనగర్, టీటీడీ రోడ్డు తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మద్యం సేవించిన వాహనదారులకు జరిమానా

నంద్యాల: మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఆరుగురికి రూ.10వేల చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్త శుక్రవారం తెలిపారు. పట్టణంలోని వై జంక్షన్ వద్ద ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తుండగా.. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఆరుగురిని పట్టుకొని వారిపై కేసు నమోదు చేసి నంద్యాల కోర్టులో హాజరు పరచగా ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున రూ.60వేలు జరిమానా విధించారని వివరించారు.

రణభేరిని విజయవంతం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

గోస్పాడు: విద్యారంగంలో నెలకొన్న సమస్యలు, ఉద్యోగ, ఉపాధ్యాయ ఆర్థికపరమైన సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపడుతున్న రణభేరి ప్రచార జాత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా రణభేరి కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటై 15 నెలలు గడిచినా ఒక్క సమస్యను పరిష్కరించలేదని మండిపడ్డారు. ఉపాధ్యాయులను ద్రోహులుగా చిత్రీకరించే పని జరుగుతోందని, ఉమ్మడి సర్వీస్ రూల్స్‌ను పరిష్కరించకుండా ప్రభుత్వమే విద్యావ్యవస్థను బలహీన పరిచిందని ఆరోపించారు. ఏకోపాధ్యాయ పాఠశాలలు అధికమయ్యాయని, విద్యార్థులు ప్రైవేటీ పాఠశాలలకు తరలిపోయే కార్యక్రమాలు రూపొందిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రణభేరి అనంతరం ఈనెల 25వ తేదీన భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు.

ప్రభుత్వ అసమర్థతపై ఉద్యమ కార్యాచరణ



మాట్లాడుతున్న శివయ్య

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు చెల్లించడంలో ప్రభుత్వ అసమర్థతను నిరసిస్తూ నిరసన వారం ఉద్యమ కార్యాచరణను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామచంద్రారెడ్డి, శివయ్య కోరారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఇంత వరకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు, కరువు భత్యం విడుదల చేయలేదన్నారు. 12వ పీఆర్సీ నియమించి 30శాతం ఐఆర్, మధ్యంతర భృతి ప్రకటించలేదన్నారు. 2003 డీఎస్సీ వారికి 57 మెమో ద్వారా వెంటనే పాత పెన్షన్ అమలు చేయాలని డిమండ్ చేశారు. సరెండర్ లీవ్ బకాయిలు చెల్లించలేదన్నారు. ఈనెల 12వ తేదీన మండల కేంద్రాల్లో ఉపాధ్యాయుల నిరసన ప్రదర్శనలు, 13న ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాల సమర్పణ, 15న తాలూకా కేంద్రంలో నిరసన, 16న జిల్లా కేంద్రాల్లో ఆందోళన కార్యక్రమాలు, 17న సీఎం, సీఎస్‌లకు వాట్సాప్, మెయిల్ సందేశాలు పంపుతామని వెల్లడించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ భాస్కరరెడ్డి, జిల్లా సభ్యులు జాకీర్‌హుసేన్, రమణ, శ్రీరాములు పాల్గొన్నారు.

నేపాల్‌లో చిక్కుకున్న నంద్యాల వాసులు

- సురక్షితమంటూ సాక్షికి సమాచారం



నేపాల్‌లో సుక్షితంగా ఉన్న నంద్యాల వాసులు

నంద్యాల(వ్యవసాయం): ఇటీవల నంద్యాల పట్టణానికి చెందిన కొందరు నేపాల్ దేశంలో వివిధ ప్రాంతాల్లోని ఆలయాల దర్శనానికి వెళ్లారు. ఈనెల 3న నంద్యాల నుంచి ప్రత్యేక వాహనంలో 26 మంది బయల్దేరారు. అయితే నేపాల్‌లో అల్లర్లు జరుగుతుండటంతో పరిస్థితి విషమంగా మారింది. దీంతో యాత్రికుల బంధువులు, కుటుంబ సభ్యుల్లో ఆందోళన నెలకొంది. యాత్రికులను స్థానిక సాక్షి విలేకరిని సంప్రదించారు.దీంతో అక్కడికి వెళ్లిన దాల్‌మిల్ అమరేష్, వంకదారి ప్రవీణ్, మరికొందరితో ఫోన్‌లో సంప్రదించారు. తమకు ఎలాంటి ఇబ్బందులు లేవని, తిరుగు ప్రయాణానికి ఏర్పాట్లు కూడా చేశారని, అందరం క్షేమంగా ఉన్నట్లు సాక్షి ద్వారా సమాచారం అందించారు. దీంతో కుటుంబీకులు, బంధువులు ఊపిరి పీల్చుకున్నారు.

వీరజవాన్‌కు నివాళి



మురళీనాయక్ తల్లిదండ్రులను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): ఆపరేషన్ సిందూర్‌లో మృతి చెందిన సత్యసాయిజిల్లా గోరంట్ల మండలం తండాకు చెందిన అగ్నివీర్ మురళీనాయక్‌కు కేర్ గ్రూప్ ఆఫ్ డాక్టర్స్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక వివేకానంద ఆడిటోరియంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మురళీనాయక్ తల్లిదండ్రులను సత్కరించారు. డాక్టర్ ఉదయ్‌శంకర్, విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ భారత సైన్యం గొప్పతనం, యుద్ధాల్లో జరిగిన ఘట్టాల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం మురళీనాయక్‌కు తల్లిదండ్రులకు నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. డాక్టర్ రామకృష్ణారెడ్డి, వైద్యులు విజయ్‌బాబు, హరినాథరెడ్డి, నర్మద, వసుధ, విశ్వహిందూ పరిషత్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి వర్ధంతి



ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): రాజ్యాంగం, లౌకిక విలువలు కాపాడటంలో ఏచూరి ప్రత్యేక ముద్ర వేశారని, సీతారాం ఏచూరి లేని లోటు పార్టీకి తీరని లోటు అని సీపీఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు గౌస్, జిల్లా కార్యదర్శి ఏసురత్నం, తోటమద్దులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏచూరి ప్రథమ వర్ధంతి సభను నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారి కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని కోరారు. నాయకులు నరసింహనాయక్, బాలవెంకట్, మౌలాలి, జైలాన్, శంకరయ్య, రామరాజు, సుబ్బారావు, వీరసేన పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాడుతాం



మాట్లాడుతున్న మౌలాలి

నంద్యాల(న్యూటౌన్): వర్తమాన విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించి పోరాటం చేస్తామని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మౌలాలి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక నేషనల్ పీజీ కళాశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శనివారం జరిగే నంద్యాల జిల్లా కార్యవర్గ సమావేశానికి సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాయిశ్రీనివాస్, రఘునాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై చర్చించి భవిష్యత్తు కార్యక్రమాలు రూపొందిస్తారని చెప్పారు. నంద్యాల జిల్లా ఇన్‌చార్జి సురేష్‌బాబు, సుబ్బయ్య, సుబ్బరాయుడు, నరసింహారావు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

నంద్యాల(అర్బన్): మండలంళక్షణ/ అబాండం తండా మండల పరిషత్ మోడల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శ్యామ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం పుస్తకాల పంపిణీ చేశారు. ట్రస్టు నిర్వాహకులు డాక్టర్ సంజీవ, డాక్టర్ శ్యామల ఆధ్వర్యంలో పలువురు విద్యార్థులకు నోట్ పుస్తకాలు, కాపీ రైటింగ్ పుస్తకాలు, జామెట్రీ బాక్స్‌లతో పాటు పాఠశాలకు మినరల్ వాటర్ క్యాన్లు, విద్యార్థులకు యూనిఫాం కుట్టించుకోవడానికి నగదు అందించారు. హెచ్‌ఎం భారతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుధ్య చర్యలు చేపట్టాలి

ఆళ్లగడ్డ: సీజనల్ వ్యాధులు సంక్రమించకుండా గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి శ్రీహరిగోపాల్ సూచించారు. శుక్రవారం ఆయన గోపాలపురంలో గ్రామంలో ఎంపీడీఓ నూర్జహాన్‌తో కలిసి పర్యటించారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల వద్ద జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. ప్రతిఒక్కరూ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

కోలుకోలేక మహిళ మృతి

నంద్యాల: స్థానిక ఎన్‌జీఓస్ కాలనీకి చెందిన సుజాత (45) కోలుకోలేక మృతి చెందిందని టూటౌన్ ఎస్‌ఐ సురేష్ శుక్రవారం తెలిపారు. వివరాలు.. సుజాత గత కొన్ని సంవత్సరాలుగా మానసిక సమస్యలతో ఇబ్బంది పడుతుండేది. దీంతో పాటు అనారోగ్య సమస్యలు మొదలవడంతో ఈనెల 10న ఇంట్లో గడ్డి మందు తాగింది. బంధువులు గమనించి పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక శుక్రవారం మృతి చెందింది. ఆమెకు భర్త శ్రీనివాసులు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

యూనిఫాం అందజేత



విద్యార్థులకు యూనిఫాం అందుజేస్తున్న దృశ్యం

శిరివెళ్ల: యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల పేద విద్యార్థులకు శుక్రవారం యూనిఫాం అందజేశారు. కళాశాల గణిత అధ్యాపకుడు బాలరాజు రూ.10 వేల సొంత నిధులతో యూనిఫాం అందజేశారు. అధ్యాపకుడికి విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలపగా ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు అభినందించారు.

భ్రమరాంబాదేవికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శుక్రవారం ఊయలసేవ నిర్వహించారు. సాయంత్రం 7గంటలకు ప్రారంభమైన సేవలో భాగంగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు ముందుగా సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. శ్రీశైలగ్రామ దేవత అంకాళమ్మకు విశేష పూజలు నిర్వహించారు.

ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న సుంకన్న

నంద్యాల(న్యూటౌన్): ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి వాహన మిత్ర పథం ద్వారా రూ.25వేలు ఇవ్వాలని, కార్మిక హక్కులను హరిస్తున్న జీఓనం.21, 31ను రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య, పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ స్త్రీ శక్తి – ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో కార్మికులు జీవనం రోడ్డుపై పడిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా ఆటో కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టాన్ని ఏర్పాటు చేసి పక్కా గృహలు నిర్మించి ఇవ్వాలని కోరారు. డిమాండ్లను పరిష్కరించకపోతే 15న ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆటో కార్మిక సంఘం నాయకులు శ్రీనివాసులు, బండి శ్రీనివాసులు, చౌదరి, బాలవెంకటేశ్వర్లు, గోకారి, జిలానీ, సుశీలమ్మ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



రాజమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి



సీనియర్ నాయకుడు పసుల ప్రభాకర్‌ను పరామర్శిస్తున్న గంగుల

శిరివెళ్ల: కార్యకర్తలకు అండగా ఉంటానని వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పలువురు కార్యకర్తలను పరామర్శించారు. ముందుగా బీసీ నాయకుడు పసుల వీరభద్రుని ఇంటికి వెళ్లి నూతన దంపతులను ఆశీర్వదించారు. బీసీ సీనియర్ నాయకుడు పసుల ప్రభాకర్‌ను పరామర్శించి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్సీ కాలనీలోని లక్కాకుల చంద్ర తల్లి రాజమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇటీవల బైపాస్ సర్జరీ చేయించుకున్న మైనారిటీ నాయకుడు నాలి ఫిదా ఇంటికి వెళ్లి అతని ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. బ్రిజేంద్రారెడ్డి వెంట పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.అబ్దుల్ సలాం, జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్‌బేగం, ఎంపీపీ నాయక్ వసీం, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నజీర్, సర్పంచు సాలమ్మ, ఉప సర్పంచు ఇంతియాజ్, నాయకులు దొర్నిపాటి రఫీ, దాదిరెడ్డి తిమ్మరాయుడు, మందాల శివారెడ్డి, ముల్లా అన్వర్‌బాషా, గౌండా ఇబ్రహీం పాల్గొన్నారు.



నర్సాపురం సమీపంలో మొక్క జొన్నలను ఆరబెడుతున్న రైతులు

మొక్క జొన్నకు ఏదీ ‘మద్దతు’

- ఏర్పాటు కాని మద్దతు ధర, కొనుగోలు కేంద్రాలు
- తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్న వ్యాపారులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



ఆలమూరు సమీపంలో విక్రయించేందుకు సంచుల్లో నింపిన మొక్క జొన్నలు

రుద్రవరం: పంటలు సాగు చేసేందుకు అవసరమైన రసాయన ఎరువులు రాయితీ ధరలకు దొరకడం లేదు. బయట ప్రైవేటు దుకాణాల్లో అధిక ధరలు వెచ్చించి యూరియా వంటి మందులు కొనుగోలుచేసి పంటలు పండిస్తే వాటికి మద్దతు ధర లభించడం లేదు. మద్దతు కల్పిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం నేటికీ వాటి ఊసే ఎత్తడంలేదు. చేసేదేమీలేక వచ్చిన దిగుబడులను నిల్వ ఉంచుకోలేక తక్కువ ధరకే ప్రైవేటు వ్యాపారులకు విక్రయించుకుంటూ రైతులు నష్టపోతున్నారు.

రుద్రవరం మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలోని రైతులు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ కింద దాదాపు 5వేల హెక్టార్లలో మొక్కజొన్న పంట సాగు చేశారు. ఆరుగాలం శ్రమించారు. పంటను కంటికి రెప్పలా చూసుకున్నారు. అవసరమైన సమయంలో రసాయన ఎరువులు, తెగుళ్ల నివారణకు పురుగుల మందు పిచికారి చేశారు. పంట కాలం పూర్తి అయ్యింది. ప్రస్తుతం మండల పరిధిలోని నర్సాపురం, ఆలమూరు, చిత్రేనిపల్లె, ముకుందాపురం, హరినగరం తదితర గ్రామాల పరిధిలో మొక్కజొన్న కోతలు సాగుతున్నాయి. వచ్చిన దిగుబడులను ఆర్అండ్‌బీ రోడ్లకు ఓ వైపు, బయలు ప్రదేశాల్లో ఆరబెడుతున్నారు. అయితే కూటమి ప్రభుత్వం పంటలను బట్టి మద్దతు ప్రకటించింది. అందులో మొక్కజొన్నలను క్వింటా రూ.2400ల ప్రకారం కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చింది. ప్రస్తుతం కోతలు సాగుతుండటంతో ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని రైతులు గింజలను ఆరబెట్టుకుంటూ విక్రయించేందుకు ఆశగా ఎదురు చూశారు. అయితే ప్రభుత్వం నుంచి ఇంత వరకు ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో ఎదురు చూడలేక తక్కువ ధరకే ప్రైవేటు వ్యాపారులకు విక్రయించుకుంటున్నారు. ప్రైవేటు వ్యాపారులు గింజలను బట్టి ధర నిర్ణయిస్తున్నారు. క్వింటా రూ.2వేల నుంచి రూ.2100లకే కొనుగోలు చేస్తున్నారు. అంటే రైతులు ఒక్కో బస్తాకు రూ.300ల నుంచి రూ.400ల వరకు నష్టపోతున్నారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలించడంతో దిగుబడులు మంచిగానే వస్తున్నాయి. వాటిని ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తే లాభాలు గడిస్తామన్న ఆశ రైతుల్లో ఉంది.